# రాజధాని ముచ్చట్లు

మద్దాలి సత్యనారాయణ శర్మ

ఎమెస్కో

# రాజధాని ముచ్చట్లు

**2-7-1982**

చాలా రోజుల తరవాత హుస్సేన్‌సాగర్ చెరువుకట్ట (టాంక్‌బండ్ అంటే కాని కొందరికి అర్థం కాదేమో!) మీదికి వెళ్లాను. హైదరాబాద్ వైపు పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా వున్న ఒక 'చెట్టు' దృష్టిని ఆకర్షించింది. నిజానికి అది చెట్టుకాదు 'మోడు'. 1980 లోనే మోడు అయింది. ఇటీవల ఆ చుట్టూపట్ల చాలా అభివృద్ధి అందగింపు కార్యక్రమం జరిగింది. అనవసరమైనవి చాలా తొలగించబడినట్లే అదీ తొలగించబడి వుంటుందను కున్నాను. కాని దానిని భద్రంగా, సురక్షితంగా మొదలు దగ్గర చుట్టూ పాలరాయి పరచి వుంచటం ఆశ్చర్యం కలిగించింది.

బహుశా నగర పురపాలక సంఘం అధికారులు ఆ మోడు మళ్లీ చిగిర్చి విస్తరించి బాటసారులకు నీడనిస్తుందని ఆశిస్తున్నారేమో!

* * *

నగర పురపాలక సంఘం ఏమిటి అని ఆశ్చర్యపోకండి. హుస్సేన్‌సాగర్ వద్ద ఇటీవల వెలసిన నగరపాలక సంఘం కార్యాలయం మీద అట్లాగే వుంది! మరి ఆ పేరు ఎవరు సృష్టించారు.

నాకు జ్ఞాపకం వున్నంతవరకూ 1950 లోనే హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ 'అనే మాటలకు' హైదరాబాద్ నగరపాలక సంఘం అనే తర్జుమా వచ్చింది. అది బాగా ప్రచారంలోకి వచ్చింది కూడాను. చాలాచోట్ల ఆ విధంగా బోర్డులు కూడా వేశారు. అది చక్కగా వున్న పేరు.

మరి ఈ 'నగర పుర' జంట ఎందుకు వచ్చిందో, ఎట్లా వచ్చిందో, ఒకవేళ హైదరాబాదు నగరము, సికిందరాబాదు పురము అని ఎంచి, జంటనగరాలను నగరపురాలుగా పేర్కొన్నారేమో!

★ ★ ★

ఢిల్లీ నుంచి వచ్చిన మిత్రునితో నగరంలో ప్రసిద్ధమైన తెలుగు హోటల్‌కు వెళ్లాను. మహా సమ్మర్దంగా వుంది. కొంత సేపటికి సీట్లు దొరికాయి. వెయిటర్ వచ్చి ఏం కావాలండీ అన్నాడు. భోజనం అన్నాను. ఏమి భోజనం అన్నాడు. 'ఏమేమి భోజనాలున్నా'యన్నాను. పంజాబీ, బొంబాయి, మెడ్రాస్ అన్నాడు. ఆంధ్రా లేదా అన్నాను. అదే, మెడ్రాసే ఆంధ్రా అన్నాడు. ఏమేమి చేస్తావు అంటే– 'రైస్, రెండు కూరలు, కూటు, పచ్చడి, ఊరగాయ, సాంబారు, రసం, అప్పళం, పెరుగు' అన్నాడు. మెడ్రాస్‌లో వున్నట్లే వుంది. ఆంధ్ర రాజధానిలో ఆంధ్రభోజనమే కరువాయెగా!

## 8-7-1982

సివిల్ సప్లయిల శాఖ ఇటీవల చేసిన కట్టుదిట్టం, అమలు జరిపిన మార్పుల వల్ల రాజధాని వాసులకు అధిక సౌకర్యాలు కలగకపోగా, వున్న సౌకర్యాలు వూడిపోయాయి.

సివిల్ సప్లయిల శాఖ అంగళ్లు ఇదివరకు అనేక వస్తువులు బజారులో కంటే సూపర్ బజారుల్లో కంటే చౌకగా అమ్మేవి. బియ్యం, పప్పులు, చింతపండు, రవ్వ, మైదా, వంటనూనె, కొన్ని రకాల సబ్బులు, సబ్బు పొడులు ఆ అంగళ్లలో దొరికేవి. అవి అన్నీ రేషన్ కార్డు అవసరం లేకుండా లభించేవి. రేషన్ షాపులో బియ్యం బాగుండక పోతే సి.సి. అంగడికి పోయి తెచ్చుకునే వాళ్లం. ఎంతమందికో ఎంతో సౌకర్యంగా వుండేది.